గురువారం। 20। జులై। 2023



0.8 టీఎంసీ నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలు ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు విడుదల చేస్తున్నారు.



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాక్షి గణపతికి అభిషేకం, జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



పీఠాధిపతి ప్రవచనాలు

మంత్రాలయం: చాతుర్మాస మహోత్సవాల సందర్భంగా శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు వ్యాఖ్యాన సహిత తాత్పర్య చంద్రికా పాఠాన్ని ప్రారంభించారు.

న్యూస్‌రీల్

సచివాలయాల్లో కారుణ్య నియామకాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో మృతి చెందితే వారి స్థానంలో అర్హత కలిగిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద సచివాలయ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో సచివాలయాల్లోని అన్ని శాఖలకు సంబంధించి అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత, కులం ఇతర అవసరమైన ధ్రువపత్రాలతో డీఆర్‌ఓ కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆలస్యంగా వస్తే జీతంలో కోత

కర్నూలు(హాస్పిటల్): విధులకు ఆలస్యంగా వచ్చే వైద్యుల జీతంలో కోత పడుతుందని వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహం చెప్పారు. బుధవారం ఆయన విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్‌తో మాట్లాడారు. బోధనాసుపత్రిలోని ప్రతి వైద్యుడు ఉదయం 9 గంటల నుంచి 9.10లోపు, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల నుంచి 4.10లోపు మూడుసార్లు ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా హాజరువేయాలన్నారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఏడు గంటలు విధుల్లో ఉండాలని, అంతకు తక్కువగా ఉన్న వారికి మొదట సెలవులు కట్ చేస్తామని, సెలవులు అయిపోతే జీతాల్లో కోత విధిస్తామన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

రూ.6.5 కోట్లకు వ్యాపారి ఐపీ

కర్నూలు(లీగల్): కర్నూలులో ఓ వ్యాపారి రూ.6.5 కోట్లకు ఐపీ (ఇన్సలవెన్స్ పిటిషన్) దాఖలు చేశారు. నగరంలో షేక్ మహమ్మద్ గౌస్ అనే వ్యాపారి సెకండ్ హ్యాండ్ వాహనాల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం కోసం 44 మంది వద్ద అప్పులు తీసుకుని వారికి తిరిగి చెల్లించలేక న్యాయవాదుల ద్వారా ఐపీ దాఖలు చేశారు. షేక్ మహమ్మద్ గౌస్ తనకు రూ.8 కోట్ల విలువ గల 14 రకాల స్థిరాస్తులు కూడా ఐపీలో చూపించారు. ఇంత పెద్ద మొత్తంలో ఐపీ పెట్టడంతో అప్పుదారులు లబోదిబోమంటున్నారు.

98 మంది టీచర్లు అదనం

కర్నూలు (సిటీ): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 98 మంది అదనంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అదనంగా ఉన్నటువంటి ఉపాధ్యాయులను ఆయా మండలాల్లో, డివిజన్ల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో టీచర్ల కొరత ఉండే చోటుకు పనిసర్దుబాటు కింద ఉత్తర్వులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.


లంచం తీసుకున్న సీనియర్ అసిస్టెంట్‌కు జైలు

కర్నూలు(లీగల్): ఎస్సీ కార్పొరేషన్‌లో రుణం మంజూరు కోసం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.45 వేల జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సునీత బుధవారం తీర్పు చెప్పారు. ఓర్వకల్లుకు చెందిన పి.తిరుమలేష్ అనే వ్యక్తి తన భార్య సరస్వతికి కర్నూలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం పొందేందుకు దరఖాస్తు పంపాలని ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ అబ్దుల్ రజాక్‌ను కోరారు. ఇందుకు తనకు రూ.10 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో తిరుమలేష్ కర్నూలు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా 2018 జూలై 10వ తేదీన లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుని షేక్ అబ్దుల్ రజాక్‌ను అరెస్టు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

కౌలుదారులకు 16,026 సీసీఆర్‌సీ కార్డులు

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 సంవత్సరానికి సంబంధించి కౌలుదారులకు పెద్ద ఎత్తున సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఏఓ, ఏడీఏ, ఆర్‌బీకే ఇన్‌చార్జీలను ఆదేశించారు. వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్యాలను రివైజ్ చేశారు. జిల్లాలో పట్టాదారులు 3,63,442 మంది ఉన్నారు. వీరిలో అనేక మంది తమ భూములను కౌలుకు ఇచ్చి ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో ఇంటింటికీ తిరిగి కౌలుదారులను గుర్తించి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని డీఏఓ ఆదేశాలు ఇచ్చారు. తాజా ఆదేశాల ప్రకారం 16,026 సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 10,704 సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేసినట్లు స్పష్టమవుతోంది.

మీసం మెలేస్తున్న సైబర్ మోసగాళ్లు!



సెల్‌ఫోన్ లేనిదే క్షణకాలం ఉండలేని పరిస్థితి. యూట్యూబ్‌లోనో.. ఫేస్‌బుక్‌లోనో..లేదంటే వాట్సాప్‌లో కాలం వెళ్లదీస్తున్న రోజులు ఇవి. ప్రజల కాలక్షేపమే సైబర్ నేరగాళ్లకు కలిసి వస్తోంది. తక్కువ డబ్బుకు ఖరీదైన వస్తువులు ఇస్తామని, లాటరీ తగిలిందని, కానుక అందజేస్తామని.. ఆశ చూపిస్తూ సామాజిక మాధ్యమాలకు లింకులు పంపి బ్యాంక్ ఖాతాల్లో డబ్బును కాజేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నా.. మోసపోయే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. నేరగాళ్ల ఆటకట్టించేందుకు పటిష్ట వ్యవస్థ ఉన్నా.. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లు మీసాలు మెలేస్తున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న సైబర్ కేసులు
- సెల్‌ఫోన్లకు లింకులు పంపి బ్యాంక్ ఖాతాలు ఖాళీ
- వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా ప్రకటనలు
- లబోదిబోమంటున్న బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

జిల్లాలో నమోదైన సైబర్ కేసుల వివరాలు...

సంవత్సరం	నమోదైన కేసులు	మోసపోయిన సొమ్ము	రికవరీ/ఫ్రీజ్ చేసిన సొమ్ము
2019	54	రూ.68,43,958	రూ.14,36,980
2020	221	రూ.1,60,66,108	రూ.78,82,561
2021	431	రూ.1,39,76,815	రూ.1,19,60,664
2022	321	రూ.18,82,939	రూ.12,05,000
2023 (జులై 15 వరకు)	814	రూ.1,68,65,074	రూ.1,43,35,312

లాటరీ పేరుతో బురిడీ

మీకు రూ.10 లక్షలు లాటరీ వచ్చిందంటూ నంద్యాల పట్టణానికి చెందిన ఓ మహిళా ఉద్యోగి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఆశతో ఆమె మెసేజ్‌లో ఉన్న లింక్ ఓపెన్ చేసింది. ఆమె నమ్మే విధంగా ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన విధంగా నకిలీ పత్రాలను సృష్టించి వాట్సాప్‌లో పంపించారు. నగదు రావాలంటే మొదట రూ.25 వేలు పంపించాలని సూచించారు. తర్వాత మీ బ్యాంకు ఖాతా పనిచేయడం లేదు.. ఇతర బ్యాంకు నుంచి డబ్బు పంపించాలని సూచించడంతో విడతల వారీగా ఆమె రూ.లక్ష వరకు పంపింది. పదేపదే ఇలాగే అడుగుతుండటంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంట్లో గొడవ అవుతుందని మిన్నకుండిపోయింది.

కానుక పేరుతో రూ.5.69 లక్షలు స్వాహా

కానుక పేరు చెప్పి బ్యాంకు ఖాతాలోని సొమ్మును ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్ల ఉదంతం ఇటీవల కర్నూలులో వెలుగుచూసింది. కర్నూలు బాబాబృందావన్ నగర్‌కు చెందిన రవితేజ భార్య నాగరత్నమ్మకు అపరిచితుడు ఫోన్ చేసి లక్కీ డిప్‌లో సెల్‌ఫోన్ నంబర్‌కు బహుమతి వచ్చిందని, ఏదో ఒక వస్తువును ఎంపిక చేసుకోవాలని ఐదు వస్తువుల పేర్లు పంపారు. నిజమేనని నమ్మి ల్యాప్‌టాప్‌ను ఆమె ఎంపిక చేసుకుంది. ఆ వస్తువును పంపేందుకు జీఎస్టీ చెల్లించాలంటూ వివిధ కారణాలు చెప్పి రూ.19 వేలు తమ ఖాతాలో జమ చేయించుకున్నారు. ఆ మొత్తాన్ని తిరిగి ఆమె ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఖాతా నంబర్, ఓటీపీ వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిసేపటికే ఆమె ఖాతాలో డబ్బు అంతా మరో ఖాతాకు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. రూ.5.69 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించిన బాధితురాలు కర్నూలు నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పూచీకత్తు లేకుండా రుణాలు ఇప్పిస్తామని మోసం...

ఇండియా బుల్స్ ఫైనాన్స్ పేరుతో ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇస్తామని ఫేస్‌బుక్‌లో ప్రకటనలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా బలిజేపల్లి గ్రామానికి చెందిన రమేష్, సురేష్ ఓ మెసేజ్ పంపారు. ఇది చూసి పెద్దపాడుకు చెందిన ఆటోడ్రైవర్ రాజన్న ఫోన్ చేశారు. ఇన్సూరెన్స్ ట్యాక్స్ పేరుతో రూ.69 వేలు డిపాజిట్ చేయించుకున్నారు. తర్వాత ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించిన రాజన్న పోలీసులను ఆశ్రయించాడు. ఇలా జిల్లాకు చెందిన 11 మంది వీరి చేతుల్లో మోసపోయారు. బాధితుల ఫిర్యాదుతో జిల్లా పోలీసులు తోడు దొంగలను అరెస్టు చేసి కటకటాలకు పంపి రూ.5.80 లక్షలు రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

కర్నూలు: సైబర్ నేరగాళ్లు ఏదో రూపంలో ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఫోన్లకు వచ్చే సందేశా(మెసేజ్)లకు కొందరు మోసపోతున్నారు. బ్యాంకు అధికారులమంటూ వ్యక్తుల ఖాతాలోని నగదును మాయం చేస్తున్నారు. మరికొందరు మెసేజ్‌లు పంపించి వ్యక్తుల ఖాతా నుంచి నగదును యథేచ్ఛగా దోచుకుంటున్న సంఘటనలు ఇటీవలే ఎక్కువయ్యాయి. పరువు పోతుందని కొందరు బయటకు చెప్పుకోలేకపోతున్నారు.

పోలీసులు అప్రమత్తం చేస్తున్నా..

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. గ్రామాలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నా ఏదో రకంగా సామాన్యులు మోసపోతూనే



ఉన్నారు. సైబర్ నేరస్తు ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, కేరళ, బీహార్, ఒడిస్సా ప్రాంతాలకు చెందినవారు కావడంతో కేసులు నమోదు చేసినప్పటికీ వాటిని ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

మోసపోయిన వ్యక్తుల నుంచి ఫిర్యాదులను తీసుకుని విచారణ ప్రారంభించేలోగా నేరస్తులు తమ పని పూర్తి చేసుకుంటున్నారు.

పెట్టుబడికి రెట్టింపు వస్తుందంటూ..

గుర్తు తెలియని నంబర్ల నుంచి ప్రజలకు మెసేజ్‌లు వస్తున్నాయి. పెట్టుబడి పెడితే రెట్టింపు మొత్తం తిరిగి వస్తుందని, బ్యాంకు ఖాతా బ్లాక్ అయిందని, మీ పాన్ కార్డు అప్‌డేట్ చేసుకోండని, మీ ఏటీఎం కార్డు నంబర్ మార్చుకోండి, మీ క్రెడిట్ కార్డు నుంచి నగదు డ్రా జరిగింది.. పరిశీలించుకోండి.. అంటూ మెసేజ్‌లతో పాటు కింద లింక్‌ను జత చేసి పంపిస్తున్నారు. వీటికి స్పందించి లింక్ ఓపెన్ చేయడమే ఆలస్యం.. వ్యక్తుల ఖాతాలోని నగదును తస్కరిస్తున్నారు. వ్యక్తులు తేరుకునేలోపే పని ముగించేస్తున్నారు.

సాంకేతికతపై పట్టున్నా...

విద్యావంతులు సాంకేతికతపై పట్టున్న నిపుణులు, ఆన్‌లైన్, కంప్యూటర్, స్మార్ట్ ఫోన్లతో ఎంతో అవగాహన ఉన్నవారు కూడా సైబర్ నేరగాళ్ల వలకు అడ్డంగా దొరికిపోతున్నారు. ప్రధానంగా కస్టమర్ కేర్, నకిలీ ప్రకటనలు, పెట్టుబడులకు లాభాల పేరుతో నేరాల్లో సగటున 30 శాతానికి పైగా ప్రైవేటు ఉద్యోగులు బాధితులుగా ఉన్నట్లు పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

చదువుకున్నవారు సైతం..

జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మీ బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయింది.. వెంటనే అప్‌డేట్ చేసుకోండి.. లేదంటే ఈరోజు నుంచి మీ ఖాతా పని చేయదు అనే మెసేజ్ వచ్చింది. భయానికి గురైన ఆ ఉపాధ్యాయుడు ఆ లింక్‌ను ఓపెన్ చేశాడు. వెంటనే సైబర్ నేరస్తుడు ఉపాధ్యాయునికి ఫోన్ చేసి తాను చెప్పినట్లుగా వివరాలు నమోదు చేయాలని కోరాడు. అలా వివరాలు నమోదు చేయడంతో బ్యాంకు ఖాతాలో రూ.80 వేలు మాయమైపోయాయి. బాధితుడు ఆందోళనకు గురై బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు తేలింది.

తీరిగ్గా చెబితే తిరిగి రావు..

కర్నూలు నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని అవతలి వారికి చెప్పడంతో ఆయన ఖాతా నుంచి రూ.45 వేలు మాయమైపోయాయి. విషయాన్ని వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో సాంకేతిక సాయంతో నిందితుడిని గుర్తించి పోగొట్టుకున్న సొమ్మును అతని ఖాతాలో పోలీసులు జమ చేయించగలిగారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీనంటూ నమ్మబలికి మోసానికి పాల్పడిన జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్‌ను పట్టుకుని అతని కార్యకలాపాలకు చెక్ పెట్టడమే కాక కటకటాలకు పంపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సొమ్ము రికవరీ చేస్తారనేందుకు నిదర్శనమే పై రెండు సంఘటనలు.

అపరిచితులతో జాగ్రత్త



అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్, ఆన్‌లైన్ లింక్ వస్తే అప్రమత్తంగా ఉండాలి. వాటికి స్పందించకపోవడమే ఉత్తమం. బాధితులు స్టేషన్‌కు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రజలు మోసపోతూనే ఉన్నారు.

– జి.కృష్ణకాంత్, ఎస్పీ



తుగ్గలి మండలం జొన్నగిరిలో వర్షంలోనే ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు గొడుగుల సాయంతో వెళ్తున్న రుద్రవరం మహిళలు



దొర్నిపాడు సమీపంలో ఆకాశం మబ్బులు కమ్మడంతో పగలే లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

ఆకాశం మేఘావృతం.. జల్లులకే పరిమితం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు తేలికపాటికే పరిమితం అవుతున్నాయి. మూడు రోజులుగా ఆకాశం మేఘావృతం అవుతున్నప్పటికీ జల్లులు మాత్రమే కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చిప్పగిరిలో 15.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం సగటున 5 మి.మీ వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా 20 రోజులైనప్పటికీ 39.7 మి.మీలను మించని పరిస్థితి.

- నంద్యాల జిల్లాలోని 23 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మహానందిలో అత్యధికంగా 13.8 మిమీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం సగటున 5 మి.మీ వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 141.2 మి.మీ కాగా ఇప్పటి వరకు 54 మి.మీలకే పరిమితమైంది.



మహానంది సమీపంలో మబ్బులు కమ్మిన ఆకాశం



గడివేముల సమీపంలోని పత్తి చేనులో నిలిచిన వర్షం నీరు



కర్నూలులో బుధవారం ఉదయం నుంచి జల్లులు కురుస్తుండటంతో స్థానికుల అవస్థలు



అభివృద్ధి కనిపించలేదా?

- చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు మంత్రి గుమ్మనూరు జయరాం సూటి ప్రశ్న

ఆలూరు: దేశంలో అందరు సీఎంలు ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రశంసిస్తుంటే రాష్ట్రంలో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూటిగా ప్రశ్నించారు. హొళగుంద మండలం ఇంగళహాళ్ గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందన్నారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన గ్రామ సచివాలయాలు ప్రతిపక్ష నేతకు కనిపించలేదా అంటూ స్థానికంగా ఉండే గ్రామ సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని చూపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాబలం పెరగడంతో వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడుతున్నారన్నారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గసభ్యుడు ప్రహ్లాద్‌రెడ్డి, గోనేహాళ్ గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి, ఆలూరు, హొళగుంద మండలాల కన్వీనర్లు షఫిఉల్లా, వీరేష్ తదితరులు ఉన్నారు.



సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని చూపిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం-2024పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటా తిరుగుతారన్నారు. ఆ సమయంలో కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణతోపాటు చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. అనుమానం ఉన్న ఓటర్లపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వచ్చిన వినతులు, అర్జీలు, ఇతర ఫిర్యాదులపై అక్టోబర్ 17వ తేదీలోపు విచారణ జరిపి ఆ రోజు ముసాయిదా జాబితాను ప్రకటిస్తామన్నారు. ముసాయిదాపై ఫిర్యాదులను అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తామన్నారు. తరువాత 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. రెండు శాతం కంటే ఎక్కువ ఓటర్లను తొలగించాలంటే కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకే ఇంట్లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే పకడ్బందీగా పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో నాగేశ్వరరావు, వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, టీడీపీ లీగల్ సెల్ నాయకుడు కేతు జగదీష్ పాల్గొన్నారు.



బనగానపల్లె ఆస్థానంలో కొలువుదీరిన పీర్లు

మొహర్రం నెల ప్రారంభం

- కొలువుదీరనున్న పీర్లు
- అగ్ని గుండాలు సిద్ధం

కర్నూలు కల్చరల్/వెల్దుర్తి: మొహర్రం నెల బుధవారం ప్రారంభమైంది. కర్బలా యుద్ధంలో మరమణించిన ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ అమర వీరుల నెలగా ముస్లింలు ఈనెలను వర్ధంతిలా జరుపుకుంటారు. అలాగే ఇదే రోజు నుంచి ఇస్లాం నూతన సంవత్సరం కూడా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ప్రజలు సుఖ సంతోషాలతోఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మొహర్రం నెల ప్రారంభానికి సూచికగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పీర్లను నిలబెట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బనగానపల్లె, బేతంచెర్ల, పుసులూరు, తడకనపల్లె, ఆత్మకూరు, కలమందలపాడు, దిగువపాడు, గొల్లలదొడ్డి, సి.బెళగల్, నిడ్జూరు తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మొహర్రం నెల ప్రారంభమైన 11వ రోజున వివిధ ప్రాంతాల్లో నిలబెట్టిన పీర్లను స్థానిక కర్బలా మైదానాల్లో నిమజ్జనం చేస్తారు.

అగ్ని గుండాల తవ్వకం

పీర్ల పండుగ పురస్కరించుకుని వెల్దుర్తి మండల వ్యాప్తంగా పీర్ల చావిడిల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేస్తూ అగ్ని గుండాలు తవ్వారు. తదుపరి రోజుల్లో పీర్లచావిడులలో పీర్లను ఆశీనులు గావించి, సరిగెత్తులు నిర్వహించి పదో రోజున నిమజ్జనం చేపడతారు. పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో ఆత్మహత్య


బోయ జయ రాముడు (ఫైల్)

గోనెగండ్ల: అప్పుల బాధ భరించలేక హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన బోయ జయరాముడు(27) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బోయ జయరాముడుకు భార్య జయలక్ష్మి, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని మూడేళ్లుగా ఉల్లి, ఇతర పంటలను సాగుచేసుకునే వాడు. రెండేళ్లుగా ఉల్లి పంట నష్టం వచ్చింది. దాదాపు రూ.2లక్షలపై అప్పు ఉన్నట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సమస్యలు, అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి పురుగు మందు తాగాడు. ఉదయం నుంచి జయరాముడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అక్కడే అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించి కోడుమూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారు జామున మృతిచెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ సమస్యలకు సత్వరమే పరిష్కారం

• ఎస్ఈ ఎం. ఉమాపతి


ఫోన్‌లో ఫిర్యాదులు వింటున్న ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి డయల్ యవర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఫోన్ ద్వారా వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కింది స్థాయి అధికారుల ఆదేశించారు. జూనియర్ లైన్‌మ్యాన్ మొదలుకొని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల వరకు ప్రతి ఉద్యోగి పని చేసే ప్రాంతంలో నివాసం ఉండాలన్నారు.

అవయవదానం


ఇంద్రసేనారెడ్డి (ఫైల్)

నందికొట్కూరు/నంద్యాల (న్యూటౌన్): ఈ నెల 6వ తేదీన కర్నూలు పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నంద్యాల ఆర్‌టీఓ కార్యాలయ ఉద్యోగి ఇంద్రసేనారెడ్డి (24)కోలుకోలేక మృతిచెందాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. డాక్టర్లు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. దీంతో తల్లి సురేఖ, కుటుంబ సభ్యులు ఇంద్రసేనారెడ్డి అవయవాలను దానం చేశారు. జీవన్‌ధన్ ట్రస్టు వారు మృతుడి శరీరం నుంచి కాలేయం, కిడ్నీలు సేకరించి ముగ్గురు వ్యక్తులకు ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. అవయవ దానం ద్వారా మరో ముగ్గురికి ప్రాణదానం చేసి ఆదర్శంగా నిలిచిన బాధిత కుటుంబాన్ని పలువురు అభినందించారు.

బడిలో బలవర్ధక ఆహారం

- పకడ్బందీగా ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు
- విద్యార్థులకు ప్రతి రోజు పౌష్టికాహారం అందజేత
- ఉమ్మడి జిల్లాలో 4,11,298 మంది విద్యార్థులకు గోరుముద్ద
- వంట ఏజెన్సీలకు పెండింగ్ లేకుండా బిల్లుల చెల్లింపు
- వర్కర్లకు వేతనాల పెంపు
- గోరుముద్ద పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్న పచ్చ పత్రిక



విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న ఎండీఎం ఏడీ శ్యాముల్ పాల్, (ఇన్‌సెట్) మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

కర్నూలు సిటీ: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందజేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఏడాది మార్చి ఆఖరులో ఈ పథకంలో కొత్తగా రాగిజావను చేర్చింది. విద్యార్థులకు ప్రతి రోజు ఒకే రకమైన భోజనం వడ్డించకుండా మెనూలో మార్పులు చేసింది. పర్యవేక్షణకు ఇటీవలే ప్రత్యేకంగా ఎంఈఓ–2లను నియమించింది. ఇప్పటికే మన బడి నాడు–నేడు పనులు పూర్తి అయిన ప్రతి స్కూల్‌లో విద్యార్థులకు విద్యాశాఖ మినరల్ వాటర్ అందిస్తోంది.

తప్పుడు లెక్కలు..రోత రాతలు

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల్లో మొత్తం 1436 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 2,67,828 మంది విద్యార్థులు, నంద్యాల జిల్లాలో 1369 పాఠశాలలల్లో 1,43,470 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. ప్రతి రోజు ఒక్కో రకమైన ఆహార పదార్థాలు తయారు చేసి వడ్డించేందుకు 7,460 వంట ఏజెన్సీలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరం ఏప్రిల్ నెల వరకు ఈ ఏజెన్సీల బిల్లులు క్లియర్ చేశారు. వంట ఏజెన్సీల నిర్వాహకులకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1000 మాత్రమే వేతనంగా ఇచ్చేవారు. ఇది కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా కేంద్రం ఇచ్చే వెయ్యికి అదనంగా మరో రెండు వేల రూపాయలు అందిస్తుంది. అయితే, ఈ నెల 7వ తేదీన ఓ పచ్చ పత్రిక తప్పుడు లెక్కలతో రోత రాతలు రాయడం గమనార్హం.

గోరుముద్దలో నాణ్యతకు పెద్ద పీట

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అత్యంత నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారు. ఇందుకు కుకింగ్ చార్జీలను సైతం పెంచారు. ప్రస్తుతం పెరిగిన చార్జీల ప్రకారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.45, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8.57 చొప్పున చెల్లిస్తున్నారు.

‘ విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం



జిల్లాలో 1436 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలవుతోంది. ఈ పథకం ద్వారా 2,67,828 మంది విద్యార్థులు మధ్యాహ్నం పాఠశాలల్లో భోజనం చేస్తున్నారు. రోజూ పోషకాలతో కూడి ఆహారం వడిస్తున్నాం. మెనూను పక్కగా అమలు చేస్తున్నాం. నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. వంట ఏజెన్సీలకు కానీ, ఆ ఏజెన్సీల నిర్వాహకులకు గానీ ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేవు. మూడు నెలల బిల్లులు పెండింగ్ అని చేసిన ప్రచారంలో వాస్తవం లేదు.

– శ్యామ్యూల్ పాల్, మధ్యాహ్న భోజన పథకం ఏడీ

‘ బిల్లులు రెగ్యులర్‌గానే వస్తున్నాయి



జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని తయారు చేసి పిల్లలకు వడ్డిస్తున్నాం. ఇంట్లో మాదిరిగా రోజు ఓ వంట చేసి పెడుతున్నాం. గతంలో ఎనిమిది నెలల కోసారి కూడా బిల్లులు వచ్చేవి కాదు. మేము అప్పులు చేసి వంట చేసి పెట్టేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా రెగ్యులర్‌గా చెల్లిస్తుంది. నెలకు ఇచ్చే వేతనం కూడా రూ. వెయ్యి నుంచి రూ. 3 వేలకు పెంచింది.

– సుజాత, ఎంపీపీఎస్(హెచ్‌డబ్ల్యూ), వెల్దుర్తి, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

తూకాల్లో మోసాలు.. రూ.1.25 లక్షల జరిమానా


కర్నూలులోని రైస్ దుకాణంలో బియ్యం బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు

కర్నూలు (న్యూసిటీ): లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు, ఆదోనిలో తనిఖీలు నిర్వహించగా వివిధ దుకాణాల్లో తూకాల్లో మోసం జరిగినట్లు తేలిందని, ఆయా షాపుల యజమానులకు రూ.1,25,000 జరిమానా విధించినట్లు ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు, ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ తెలియజేశారు. బుధవారం కర్నూలులోని ఓ రైస్ దుకాణంలో తనిఖీ చేసి.. వంద బస్తాలను తూకం వేయగా తక్కువ రావడంతో ఐదు కేసు నమోదు చేసి జరిమానా విధించామని ఏసీ తెలిపారు. ఆదోనిలోని ఆయిల్ షాపు తనిఖీ చేయగా ఒక ప్యాకెట్‌పై 150 గ్రాములు తూకం తక్కువ వచ్చింది. అలాగే రైస్ దుకాణంలోని బస్తాల్లో తక్కువ తూకాలు వచ్చాయి. దీంతో సంబంధిత వ్యాపారులకు జరిమానా విధించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వినియోగదారులను మోసం చేస్తూ పట్టుబడితే షాపుల లైసెన్స్‌లు రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు.

రేపటి నుంచి కార్డియాలజిస్టుల రాష్ట్ర సదస్సు

- కర్నూలులో మూడు రోజుల పాటు నిర్వహణ


మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కార్డియాలజిస్టుల రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 21వ తేదీ నుంచి కర్నూలులో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహించే ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి కార్డియాలజిస్టులు హాజరుకానున్నారు. బుధవారం సదస్సుకు సంబంధించిన వివరాలను ఏపీ కార్డియాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.చంద్రశేఖర్ వివరించారు. 21న కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో పోస్టుగాడ్యుయేట్ టీచింగ్ జరుగుతుందన్నారు. 22, 23వ తేదీల్లో కళాశాలలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో గుండెజబ్బుల చికిత్సల గురించి నిపుణులైన వైద్యులు చర్చిస్తారన్నారు. స్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఈ సదస్సు నుంచే డాక్టర్ ఎ.వసంతకుమార్ కొనసాగుతారన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా కార్డియాలజీలో ఉత్తమ సేవలందించిన డాక్టర్ పి. చంద్రశేఖర్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేసి సన్మానించనున్నట్లు తెలిపారు. బెస్ట్‌పేపర్ అవార్డును సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ జి. సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రదానం చేస్తామన్నారు. సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్ మహమ్మద్ అలి, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎంఈఓలకు షోకాజ్ నోటీసులు

కర్నూలు (సిటీ): ఇన్‌యాప్సెంట్ కింద పదోన్నతులు పొందినా వారిని రిలీవ్ చేయకుండా ఉన్న ఎంఈఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓ రంగారెడ్డికి విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం సూచించారు. ఇటీవల సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. అయితే పదోన్నతుల సీనియారిటీ జాబితాలో ఉండి కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన 15 మంది టీచర్లకు ఇన్‌యాప్సెంట్ ఆర్డర్లు జారీ చేశారు. పదోన్నతుల ప్రక్రియ పూర్తయి పది రోజులవుతున్నా ఇంతవరకు వారిని రిలీవ్ చేయలేదు. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు ఎంఈఓలపై జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ 15 మంది టీచర్లను రిలీవ్ చేసి వారికి కేటాయించబడిన స్కూళ్లలో చేరాలని ఆదేశాలు జారీ చేయాలని డీఈఓకు సూచించారు.

మున్సిపల్ స్కూళ్లలో పని సర్దుబాటు

కర్నూలు(సిటీ): పని సర్దుబాటు కింద ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగం బుధవారం విలేకరులకు తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 110 మంది ఎస్‌జీటీ టీచర్లను, నంద్యాల మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 29 మంది టీచర్లను సర్దుబాటు చేశామన్నారు. అలాగే ఆదోని మున్సిపల్ స్కూళ్లలో 30 మంది టీచర్లను సర్దుబాటు చేశామన్నారు. వారికి ఉత్తర్వులు కూడా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రంగారెడ్డి, ఏడీ శ్యామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం

- జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


మహిళకు కుల ధృవీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి

నందవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధ్యమైందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం నందవరం మండల కేంద్రంలోని 2, 3 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ప్రభుత్వం మంజూరు చేసిన ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రజల వద్దకు పాలన తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధృవీకరణ పత్రాలు ఉచితంగా మంజూరు చేస్తున్నట్లు వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లాలోనే నందవరం మండలం మొదటి స్థానంలో ఉండటం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు మండలంలో 8,500 ధృవీకరణ పత్రాలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివప్పగౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, మండల నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి, సింగల్ విండో మాజీ డైరెక్టర్ సోగనూరు భీమిరెడ్డి, జెసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, ఎంపీడీఓ దశరథ రామయ్య, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

వెల్దుర్తి: రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వెల్దుర్తి మండలం బోగోలు రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. కర్నూలు రైల్వే ఎస్ఐ, డోన్ రైల్వే అవుట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన శివసాగర్ (45) తన భార్య చెన్నమ్మతో కలిసి బతుకుతెరువు కోసం కాచిగూడ స్టేషన్‌లో మంగళవారం రాత్రి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరుకు బయలుదేరాడు. రైలు డోర్ వద్ద కూర్చొని ఉండగా బోగోలు రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తూ శివసాగర్ జారి పడ్డాడు. భార్య ఆందోళన చెంది రైలు డోన్‌కు చేరుకోగా అక్కడి రైల్వే పోలీసులకు తెలిపింది. రైల్వే పోలీసులు రాత్రంతా టార్చిలైట్లతో వెతికినా శివరాముడి జాడ కానరాలేదు. బుధవారం ఉదయం గేట్‌మ్యాన్ శివసాగర్ మృతదేహాన్ని గుర్తించి బోగోలు రైల్వే స్టేషన్ మాస్టర్ చక్రవర్తికి సమాచారం అందించాడు. మృతుని భార్యతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని డోన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేస్తున్న ఋషి(36) బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లాకు చెందిన ఋషి 13 ఏళ్ల నుంచి అల్ట్రాటెక్‌లో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. భార్య పుష్పతో ఉన్న మనస్పర్థల కారణంగా ఇటీవలనే వైజాగ్‌కు బదిలీ చేయించుకున్నాడు. అయితే, ఇంకా రిలీవ్ కాలేదు. బుధవారం ఉన్నట్టుండి క్వార్టర్స్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి తల్లి వెంకటరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు.

అత్యాచార ఘటనపై కేసు నమోదు


మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

జూపాడుబంగ్లా: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ విషయాన్ని బుధవారం డీఎస్పీ శ్రీనివాసరావు విలేకరులకు వెల్లడించారు. ఈనెల 10 వ తేదీన జూపాడుబంగ్లాకు చెందిన బాలిక పూలకోసం సిపాయి హరకుమార్‌గౌడ్ ఇంటి వద్దకు వెళ్లగా అతను బలత్కారం చేశాడు. ఈ మేరకు బాధిత బాలిక, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితురాలిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. కాగా అత్యాచార ఘటనపై ఈనెల 15వ తేదీ ఫిర్యాదు చేస్తే ఎందుకు కేసు నమోదు చేయలేదని ఎస్ఐ వెంకటసుబ్బయ్యపై డీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు.

గోరుకల్లును సందర్శించిన సీడీఓ సభ్యులు


కట్ట కుంగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సభ్యులు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయాన్ని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సభ్యులు బుధవారం పరిశీలించారు. వర్షం పడుతుండడం, వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వారు జేసీబీలో కిలోమీటరు దూరం ప్రయాణించి కట్టపైకి చేరుకున్నారు. కట్ట నిర్మాణం, గేట్ల పనితీరు, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, బండ్ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం.. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. బండ్‌పై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కట్ట మరమ్మతులను నిత్యం పర్యవేక్షణ చేయాలని, ఉన్నతాధికారుల సూచనలు పాటించాలన్నారు. తమ పరిశీలనలో తేలిన అంశాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సీడీఓ సభ్యులు సీఈ శ్రీనివాస యాదవ్, ఈఈ భాస్కర్, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, రీనా ఉమ్మడి జిల్లా సీఈ కబీర్‌బాషా, కడప క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ శారద, నంద్యాల క్వాలిటీ కంట్రోల్ ఈఈ నాగరాజు, ఈఈ శుభకుమార్, గోరుకల్లు డీఈఈ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సర్

- వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం)/డోన్‌టౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులు, కార్మికుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ఉద్యోగులు బుధవారం థాంక్యూ సీఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నంద్యాలలో ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, ఏపీపీటీడీ జిల్లా చైర్మన్ అల్లాబకాస్ పాల్గొని మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వయోపరిమితి 62 సంవత్సరాలు పెంచి పీఎఫ్ హయ్యర్ ఆప్షన్ ద్వారా అధిక పెన్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు, సుబ్బరాజు, ఆర్ఎస్‌రావు, రాయుడు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది, అన్ని అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



డోన్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సీఎం మేలు మరువలేం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మరువలేనిదని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో బుధవారం ఉద్యోగులు, కార్మికులు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి పీఆర్సీని అమలు చేసినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

కర్నూలు సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని డీఈఓ రంగారెడ్డి అన్నారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో జీవన నైపుణ్యాలపై నిర్వహించిన రెండో విడత శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. మ్యాజిక్ బస్ పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలతో కథలు చెప్పించాలని, ఆటలు ఆడించాలన్నారు. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధరా దేవి, శిక్షకులు రమేష్, మనోహర్ పాల్గొన్నారు.

బోరు బావులకు రీచార్జింగ్


బోరు బావులకు రీచార్జింగ్ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: నీటి లభ్యత పెంచేందుకు బోరు బావులను రీచార్జింగ్ చేస్తున్నట్లు రూరల్ స్టడీస్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు విజయ్, వీల్స్ గ్లోబల్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆపరేషన్స్ జేపీఏ కృష్ణమూర్తి తెలిపారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా బోరు బావుల కేసింగ్‌లకు రంధ్రాలు ఏర్పాటు చేసి బోరు పరిస్థితిని రైతులకు తెలియజేసే కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని వెంకటాపురం, బొంతిరాళ్ల గ్రామాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాలు తక్కువ ఉన్న ప్రాంతాల్లోని బోరు బావులకు నీటి వనరుల పెంచేందుకు మహారాష్ట్ర పూణేకు చెందిన యూఈటీపీఎల్ సంస్థ ద్వారా డోన్, బేతంచెర్ల, కర్నూలు మండలాల్లో రీచార్జింగ్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. యూఈటీపీఎల్ సంస్థకు చెందిన ప్రతినిధి ప్రమిత్, ఆర్ఎస్‌డీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.